News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 05 | సంచిక :212 | ఖమ్మం | ఆదివారం, సెప్టెంబర్ 6, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

- అధికారులకు కీలక సూచనలు చేసిన స్పీకర్, ఛైర్మన్
- అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, వసతులపై స్పీకర్, మండలి ఛైర్మన్ ఆధ్వర్యంలో సమావేశం
- సభ్యులు కోరిన సమాచారం త్వరగా అందించాలని స్పీకర్ ఆదేశం – భద్రతా ఏర్పాట్లపై ఆరా
- సభలో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు



హైదరాబాద్

సోమవారం నుంచి తెలంగాణ అసెంబ్లీ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశించారు. సభ్యులు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని అధికారులకు సూచించారు. సమావేశాల నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్? కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శాసన వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ అధికారులు, డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. గత సమావేశాల కంటే వేగంగా, వివరాలు 2లో..



# డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

- 'మొబైల్ వినియోగానికి క్రీడలే పరిష్కారం'
- 'విద్యార్థుల్లో డ్రగ్స్, స్క్రీన్ టైం విషయంలో అప్రమత్తంగా ఉండాలి'
- ఉపాధ్యాయులకు ప్రధాని మోదీ సూచన
- విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగంపై ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ సూచన
- పిల్లలు మొబైల్ ఫోన్లకు బానిస కాకుండా క్రీడల వైపు మళ్లించాలని పిలుపు

# ఇక సిరిసిల్ల, సిద్దిపేటలపై దండయాత్రే

- సీట్లు పెరిగితే 117, ఇప్పుడున్నవే అయితే 90 గెలుస్తాం
- వచ్చేసారి కూడా తెలంగాణలో ఇందిరమ్మ పాలన వస్తుంది.
- వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే
- నకిరేకల్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శ్రీకారం
- రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం
- నకిరేకల్‌లోని రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో బహిరంగ సభలో పాల్గొన్న రేవంత్
- ప్రజాపాలన పోవాలి పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారు
- తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం



హైదరాబాద్

ఏ విషయంపైనైనా చర్చించేందుకు తాను సిద్ధమన్న సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీకి రావాలని బీఆర్?ఎస్ అధినేత కేసీఆర్‌కు సవాల్ విసిరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం, స్థానిక రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదిపాటు రాకపోతే తొలగిస్తామని, వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చయ్యిందని, ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదని అన్నారు. ప్రజల సొమ్ము తిని ప్రజా సమస్యలు ప్రస్తావించరా? అని నిలదీశారు. బీఆర్ఎస్ అనే మొక్కను తెలంగాణలో మొలకెత్తనివ్వమని, సిరిసిల్ల, సిద్దిపేటలోనూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ నెలఖరుకు వస్తా, సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా, వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా, కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?, సీట్లు పెరిగితే 117 సీట్లు గెలుస్తాం, ఇప్పుడున్న సీట్లే ఉంటే 90 సీట్లు గెలుస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన పోవాలి వివరాలు 2లో..



# ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో కీలక మార్పులు

- పలు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం
- పలు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌లను నియమించిన కాంగ్రెస్ అధిష్టానం
- ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యులుగా పీవీ మోహన్ నియామకం
- ఆదేశాలు జారీ చేసిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్



# అసెంబ్లీ ఎన్నికల వేళ 4 రాష్ట్రాల్లో జనగణన

- ఈ డిసెంబర్ 1 నుంచే షురూ!
- ఉత్తరాఖండ్, గోవా, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్‌లో జనగణన షెడ్యూల్ రిలీజ్
- 2026 డిసెంబర్ 1 నుంచి 2027 జనవరి 4 వరకు నిర్వహణ
- వచ్చే ఏడాదే 4 రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు

# ఫ్యూచర్ సిటీలో మెగా ప్రాజెక్ట్



- తెలంగాణకు భారీ డేటా సెంటర్.. రూ.70 వేల కోట్ల పెట్టుబడి!
- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లు
- తెలంగాణ ప్రభుత్వం, టీసీఎస్, హైపర్ వాల్ట్ ప్రతినిధుల మధ్య అవగాహన ఒప్పందం
- తెలంగాణలో ఓపెన్ ఏఐకు అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసే దిశగా ఈ ప్రాజెక్టు కీలకం
- తెలంగాణను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడంలో.. భారీ పెట్టుబడులు కీలక పాత్ర పోషిస్తాయి
- టాటా, టీసీఎస్, హైపర్ వాల్ట్ వంటి సంస్థల భారీ పెట్టుబడులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయి

హైదరాబాద్

తెలంగాణలో భారీ పెట్టుబడులకు మరో అడుగు పడింది. దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్లలో ఒకటిగా నిలిచే ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకురావడానికి ప్రభుత్వం కీలక ఒప్పందం చేసుకుంది. సుమారు రూ.70 వేల కోట్ల పెట్టుబడితో.. 1 గిగావాట్ సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. హైదరాబాద్ సమీపంలోని.. కొంగరకలాన్ ఫ్యూచర్ సిటీలో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమక్షంలో.. తెలంగాణ ప్రభుత్వం, టీసీఎస్, హైపర్ వాల్ట్ ప్రతినిధుల మధ్య అవగాహన ఒప్పందం వివరాలు 2లో..




# కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లే

- ఢిల్లీలో కేబినెట్ విస్తరణపై చర్చ జరగలేదు
- కేవలం కొండా సురేఖ, చిన్నా రెడ్డి అంశంపై మాత్రమే చర్చ జరిగింది
- కేబినెట్ విస్తరణపై హైకమాండ్ నుండి ఎలాంటి సమాచారం లేదు
- మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం

సురేఖ ఎపిసోడ్, కేబినెట్ విస్తరణపై మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్

తెలంగాణలో కేబినెట్ విస్తరణ అంశం, కొండా సురేఖ ఎపిసోడ్‌పై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సురేఖను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించినట్టు ఆయన చెప్పుకొచ్చారు. అలాగే, కేబినెట్ విస్తరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇష్టానుసారం జరుగుతుందని తెలిపారు. మీడియా చిట్ చాట్‌లో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. 'కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లే. ఢిల్లీలో కేబినెట్ విస్తరణపై చర్చ జరగలేదు. కేవలం కొండా సురేఖ, చిన్నా రెడ్డి అంశంపై మాత్రమే చర్చ జరిగింది. కేబినెట్ విస్తరణపై హైకమాండ్ నుండి వివరాలు 2లో..



# మీడియా రంగం విశ్వసనీయత కోల్పోతోంది

- నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు
- ప్రజాస్వామ్యానికి మీడియా, న్యాయవ్యవస్థ కీలకం
- మీడియా రంగంలో విశ్వసనీయత సంక్షోభం సమస్య మరింత తీవ్రమైంది
- ప్రజాస్వామ్య పురోగతికి స్వతంత్ర మీడియా ఎంతో ముఖ్యం
- ప్రజలు, సమాజం కోసం పనిచేస్తే క్రెడిబిలిటీ తిరిగి సాధించొచ్చని సూచనలు

# ఫ్యూచర్ సిటీలో మెగా ప్రాజెక్ట్

-మొదటిపేజీ తరువాయి

కుదిరింది. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణను దేశంలోని ప్రముఖ డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. తెలంగాణలో ఓపెన్ ఏఐకు అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసే దిశగా ఈ ప్రాజెక్టు కీలకంగా ఉండనుందని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. వన్ గిగావాట్ సామర్థ్యం కలిగిన ఈ డేటా సెంటర్‌ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించనున్నట్లు తెలిపారు. డేటా సెంటర్లకు.. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ సేవలు వంటి రంగాల నుంచి భారీగా డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇంత పెద్ద డేటా సెంటర్ తెలంగాణలో ఏర్పాటు కావడం రాష్ట్ర డిజిటల్ ఎకానమీకి మరింత బలం చేకూరుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

### దావోస్ భేటీతో మొదలై..

ఈ ప్రాజెక్టు వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రయత్నాలు కీలకమని ప్రభుత్వం చెబుతోంది. ఎందుకంటే.. జనవరిలో దావోస్‌లో టీసీఎస్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌తో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఆ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆయన కోరారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొస్తున్న 'తెలంగాణ రైజింగ్' పాలసీ, అలాగే ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలపై టాటా సన్స్ చైర్మన్ ఆసక్తి చూపారని ప్రభుత్వం తెలిపింది. ముఖ్యమంత్రి చేసిన చర్చల అనంతరం టాటా గ్రూప్ ఈ భారీ ప్రాజెక్టుకు సిద్ధమైనట్లు వెల్లడించింది. ప్రస్తుతం టాటా గ్రూప్‌కు చెందిన సంస్థల్లో.. తెలంగాణలోనే సుమారు 83 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని ప్రభుత్వం పేర్కొంది. ఈ కొత్త ప్రాజెక్టుతో రాష్ట్రంలో టాటా గ్రూప్ కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశం ఉంది.

### ఏడువేల ఉద్యోగాలు

తెలంగాణలో ప్రారంభం కానున్న..ఈ భారీ డేటా సెంటర్ నిర్మాణాన్ని 18 నుంచి 24 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత సుమారు 7 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని ప్రభుత్వం తెలిపింది. ముఖ్యంగా డేటా సెంటర్ నిర్మాణం, నిర్వహణ, సాంకేతిక సేవలు, విద్యుత్, భద్రత, మౌలిక వసతులు వంటి అనేక రంగాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా



ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.

### ఫ్యూచర్ సిటీకి ప్రాధాన్యం

రూ.70 వేల కోట్ల పెట్టుబడి.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో ఒక కీలక మైలురాయి అని ప్రభుత్వం చెబుతోంది. ప్రపంచ స్థాయి డేటా సెంటర్ ఏర్పాటు కావడం ద్వారా.. ఫ్యూచర్ సిటీ బ్రాండ్ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ప్రభుత్వం ఆశిస్తోంది. కాగా.. ఇప్పటికే ఫ్యూచర్ సిటీని భవిష్యత్ టెక్నాలజీ, పరిశ్రమలు, ఆధునిక మౌలిక వసతులకు కేంద్రంగా అభివృద్ధి చేయాలని తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఈ భారీ పెట్టుబడి మరిన్ని అంతర్జాతీయ, జాతీయ సంస్థలను తెలంగాణ వైపు ఆకర్షించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

### మెండుగా బ్లూ కాలర్ ఉద్యోగాలు

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేక ఉద్యోగాలను భర్తీ చేసే అవకాశం ఉన్నప్పటికీ, బ్లూ కాలర్ ఉద్యోగాలను పూర్తిగా భర్తీ చేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. కానీ, టాటా గ్రూప్ చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా బ్లూ కాలర్ ఉద్యోగాలు పెరుగుతాయని అన్నారు. అందుకే.. తెలంగాణ ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. భవిష్యత్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు యువతలో పెంచడం ద్వారా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని చెప్పారు.

### రేడియల్ రోడ్డు.. రతన్ టాటాకు అంకితం

ఫ్యూచర్ సిటీకి మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడానికి.. త్వరలోనే కొంగరకలాన్ ఫ్యూచర్ సిటీకి రేడియల్ రోడ్డును నిర్మించనున్నట్లు సీఎం తెలిపారు. ఈ రహదారిని భారతరత్న రతన్ టాటాకు అంకితం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అంతే కాకుండా.. తెలంగాణను పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రంగా మార్చి, భారీ పరిశ్రమలు, టెక్నాలజీ సంస్థలను ఆకర్షించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

### 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లు

తెలంగాణను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడంలో.. భారీ పెట్టుబడులు కీలక పాత్ర పోషిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. 2037 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాలను సాధించడానికి ప్రభుత్వం కష్టపడి పనిచేస్తోందని సీఎం తెలిపారు. టాటా, టీసీఎస్, హైపర్ వాల్ట్ వంటి సంస్థల భారీ పెట్టుబడులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

# ఇక సిరిసిల్ల, సిద్ధిపేటలపై దండయాత్రే

-మొదటిపేజీ తరువాయి

పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మీ జిల్లాకు ఒకేసారి మూడు ఎమ్మెల్సీ పదవులను ఇచ్చామని, కేసీఆర్ సీఎం అయితే వాళ్ల కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారని, తమ ప్రభుత్వంలో ఉద్యమకారుల పిల్లలకు పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. అందరిలాగానే బీఆర్ఎస్ కార్యకర్తలకూ రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కృషి కాదా అని సీఎం ప్రశ్నించారు. మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు వద్దన్నారా అని అడిగారు. సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు.

"నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా నాకు సంస్కారం ఉంది. నాకు సంస్కారం ఉంది కాబట్టే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని మీరు చెల్లిని బయటకు గెంటేశారు. చెల్లిని బయటకు గెంటేసిన వ్యక్తి ఆడబిడ్డల గురించి ఆలోచిస్తారా?. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు. ఆడబిడ్డను చూసుకోవాలి. నీ సంస్కారం ఏంటో నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రా చూసుకుందాం. నేను మంచిగా ఉంటే మీరు ఏదో అనుకుంటున్నారు. బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు"



### రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం

వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందన్న రేవంత్ రెడ్డి నకిరేకల్ గడ్డా కాంగ్రెస్ అడ్డా అని వేముల వీరేశం నిరూపించారని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి అండగా ఉండాలని వీరేశం కోరారని అన్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన ఏ పథకాన్ని అయినా రద్దు చేశామా అని అడిగారు. మీరు ఇచ్చిన పథకాలను మరింత మెరుగ్గా ఇస్తున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల రైతులు అనేక రకాలుగా మోసపోయారని, చివరి విడత రైతుభరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారని పేర్కొన్నారు. మీరు ఎగవేసిన రైతుభరోసా రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ముంచి గద్దె దిగిపోయారని, వడ్ల కొనుగోలు, రైతుభరోసా, వడ్లకు బోనస్, ఉచిత కరెంట్ ఇస్తున్నామని వెల్లడించారు.

"మీకు ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి. అన్నీ చర్చిద్దాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం రూ.11 వేల కోట్లు ఇచ్చాం. ఇవాళ కోటి మంది మహిళలు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ఇవ్వడం చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు రద్దు చేయాలంటూ ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారు. సమస్యలు ఏంటో చెప్పాలని ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్నారు. వీలైన ప్రతిచోటా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. కేసీఆర్ ఎప్పుడైనా మహిళల బాగు గురించి ఆలోచించారా?. మహిళలకు పెట్రోల్ బంకులు, సోలార్ నిర్వహణ అప్పగించాం. నిరుద్యోగ యువత ఉసురు పోసుకుని ఇవాళ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగవని కేసీఆర్ గుర్తుపెట్టుకోవాలి" - రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

### అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం

నల్గొండ జిల్లా నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి ఆస్పత్రి మొత్తం తిరిగి పరిశీలించారు. ఆస్పత్రిలో అందించబోయే సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నకిరేకల్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. రూ.345 కోట్లతో 12 రకాల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, సమీకృత మండల కార్యాలయాల సముదాయ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు.

# అవకాశం ఉన్నా అందుకోలేకపోతున్న తెలంగాణ బీజేపీ

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయ రంగంలో భారతీయ జనతా పార్టీ ఒక ప్రత్యేకమైన సవాలును, అదే సమయంలో అపారమైన అవకాశాన్ని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బలమైన ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు కావాల్సిన సానుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ, ఆ అవకాశాలను ప్రత్యక్ష రాజకీయ ప్రయోజనాలుగా మలచుకోవడంలో బీజేపీ పూర్తి స్థాయిలో సఫలీకృతం కాలేకపోతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ స్థానాలను గెలుచుకుని, 35 శాతం మేర ఓటు షేర్‌ను సాధించి తన ప్రాభవాన్ని చాటుకున్నప్పటికీ, ఆ ఊపును క్షేత్రస్థాయి స్థానిక సంస్థల ఎన్నికలు మరియు నియోజకవర్గ స్థాయిలో నిలబెట్టుకోవడంలో పార్టీ కొంత తడబడుతోంది.ప్రస్తుతం తెలంగాణ బీజేపీలో వ్యక్తమవుతున్న అతిపెద్ద లోపం బలమైన నిలకడైన నాయకత్వం . ఉత్తర తెలంగాణలో పార్టీకి గట్టి పట్టు ఉన్నప్పటికీ, తెలంగాణ వ్యాప్తంగా ఓటర్లను ఆకర్షించగల, సర్వామోదయోగ్యమైన అగ్రనేత కొరత స్పష్టంగా కనిపిస్తోంది. తరచూ మారుతున్న వ్యూహాలు, నాయకత్వ మార్పులు, అంతర్గత విబేధాలు క్యాడర్‌లో గందరగోళాన్ని నింపుతున్నాయి. ప్రజల సమస్యలపై నిలకడగా పోరాటం చేస్తూ, ప్రతీ నియోజకవర్గంలో పార్టీని నడిపించే ఒక పవర్‌ఫుల్ ఫేస్ లేకపోవడం పార్టీ విస్తరణకు ప్రధాన ప్రతిబంధకంగా మారింది.పాక్షికంగా బిఆర్ఎస్ వైఖరి పట్ల సానుభూతి, మెత్తటి వైఖరి అవలంబిస్తుందనే ప్రచారం కూడా బీజేపీకి రాజకీయంగా నష్టం చేకూరుస్తోంది. గత పదేళ్ల బిఆర్ఎస్



పాలనపై కోపంతో ఉన్న ఓటర్లు లేదా కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి చెందుతున్న ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూడాలంటే.. బీజేపీ స్పష్టమైన ప్రతిపక్ష పాత్రను పోషించాల్సి ఉంటుంది. బిఆర్ఎస్ గ్రాఫ్ పడిపోతున్న ప్రతిసారీ ఆ పార్టీ స్థానాన్ని ఆక్రమించడంలో వెనకబడితే, ఆ ఓటు బ్యాంక్ మొత్తం తిరిగి కాంగ్రెస్ వైపునకో లేదా స్వతంత్రుల వైపునకో మరలే ప్రమాదం ఉంది.భవిష్యత్తులో బీజేపీ అధికార పీఠానికి చేరువ కావాలంటే, బిఆర్ఎస్ సాంప్రదాయక ఓటు బ్యాంకును కైవసం చేసుకోవడమే ఏకైక మార్గం. ఒకప్పుడు బిఆర్ఎస్‌కు అండగా నిలిచిన గ్రామీణ, వెనుకబడిన వర్గాలు, తటస్థ ఓటర్లను తనవైపు తిప్పుకునేందుకు పక్కా ప్రణాళిక అవసరం. బిఆర్ఎస్ నాయకత్వం రెస్ట్ మోడ్‌లో ఉందనే భావన ప్రజల్లో ఉన్నప్పుడు, ఆ ఖాళీని బీజేపీ తన నిరంతర ప్రజా ఉద్యమాల ద్వారా భర్తీ చేయాలి. కేవలం హిందుత్వ ఎజెండా లేదా పార్లమెంట్ ఎన్నికల నాటి ఇమేజ్‌పైనే ఆధారపడకుండా, స్థానిక సమస్యలపై పోరాటం చేయాల్సి ఉంటుంది. అయితే ఈ మార్గం అనుకున్నంత సులువు కాదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కాంగ్రెస్ తన సంక్షేమ పథకాలు, క్షేత్రస్థాయి యంత్రాంగంతో బలంగా నిలబడింది. బిఆర్ఎస్ ఓటు బ్యాంకును ఆకర్షించడంలో కాంగ్రెస్ సైతం తన మార్క్ చూపుతోంది. ఈ త్రికోణ పోటీలో బీజేపీ తన ప్రత్యర్థి కేవలం కాంగ్రెస్ మాత్రమేనని చాటిచెబుతూ, బిఆర్ఎస్ మిగిల్చిన రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయడానికి సమగ్రమైన సంస్థాగత నిర్మాణం చేపడితే తప్ప అనుకున్న లక్ష్యం సాధ్యం కాదు.రాబోయే రెండేళ్ల సమయం తెలంగాణ బీజేపీకి అత్యంత కీలకమైనది. పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధి దాటి, గల్లీ స్థాయి వరకు కమిటీలను బలోపేతం చేసుకోవడం, ఇతర పార్టీల నుంచి సీనియర్ నేతలను ఆకర్షించడం మరియు ఓటర్లలో నమ్మకాన్ని కలిగించేలా ఏకీకృత నాయకత్వాన్ని తీసుకురావడం తక్షణ అవసరం. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ, సానుభూతి రాజకీయాలను పక్కనబెట్టి అగ్రెసివ్ అప్రోచ్‌తో ముందుకు వెళ్తేనే తెలంగాణలో కమలం వికసించే అవకాశాలు మెరుగవుతాయి.

## రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

-మొదటిపేజీ తరువాయి

సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే అవకాశం ఉందని గుత్తా అన్నారు. సభకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు సమావేశాల సమయంలో అందుబాటులో ఉండాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి? ఆదేశించారు. సభ్యులకు అందించే మెటీరియల్‌ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ముందుగానే అందించాలని సూచించారు. సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్, ఛైర్మన్? ఆదేశాలు జారీ చేశారు. ధర్నాలు, రాస్తారోకోలు జరగకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటెలిజెన్స్ సమాచారం వేగంగా అసెంబ్లీ అధికారులకు చేరేలా సమన్వయం చేయాలని ఆదేశించారు. సమావేశాల నిర్వహణ కోసం నోడల్ అధికారులను నియమించాలన్నారు.

### ప్రభుత్వ తరపున పూర్తి సహకారం అందిస్తాం

సభ్యుల ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను ఒకరోజు ముందే అందించాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ప్రతి శాఖ నుంచి ఒక అధికారి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉభయ సభల సమావేశాలు ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ సమర్థతకు నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు. ప్రభుత్వం తరపున సమావేశాలకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.

### వర్షాకాల సమావేశాలు వాడివేడిగా సాగే సూచనలు

ఈ వర్షాకాల సమావేశాల్లో పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు ముఖ్యమైన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు, ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విపక్షాలు కూడా సిద్ధమవుతున్నాయి. దీంతో ఈసారి వర్షాకాల సమావేశాలు వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. వర్షాకాల సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయనేది బిజినెస్ అడ్వైజరీ కమిటీ-బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, కొత్త బిల్లుల ఆమోదం లాంటివి ప్రభుత్వ అజెండాగా ఉంటాయి.

## కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లే



-మొదటిపేజీ తరువాయి

ఎలాంటి సమాచారం లేదు. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం. నాకు మంత్రి పదవి అనే ప్రచారంపై నాకు మాత్రం సమాచారం లేదు. అవన్నీ ఊహాగానాలే. అలాగే, కొండా సురేఖను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించాం. సురేఖ విషయంలో అందరం మా వంతు ప్రయత్నం చేశాం. సురేఖ విషయంలో ఏఐసీసీ ఒప్పుకోలేదు అంటూ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ ఆశయాన్ని రేవంత్ నెరవేర్చారు. కుల సర్వే శాస్త్రీయంగా చేశాం. రాబోయే వంద రోజులు దేశవ్యాప్తంగా బీసీ హక్కుల గర్జన చేస్తాం. బీసీ హక్కుల కోసం జరిగే గర్జనను విజయవంతం చేయండి' అని పిలుపునిచ్చారు. మరోవైపు.. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బండి సంజయ్, అరవింద్, ఈటల, లక్ష్మణ్ బీసీల అంశంపై స్పందించాలి. అడిగితే పదవులు పోతాయని బీజేపీ బీసీ నేతలు భయపడుతున్నారా?. తెలంగాణలో బీజేపీ ఉండాలా వద్దా తేల్చుకోండి. కుల గణనలో దేశానికి రోల్ మోడల్‌గా ఉన్నాం. తెలంగాణ చేసిన కులగణనలో అన్ని విషయాలు పొందుపరిచాం. మేం పంపిన ఫైల్‌పై కేంద్రం ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేదు. ఓబీసీల జనాభాను ఎందుకు లెక్కించడం లేదు? అని ప్రశ్నించారు.

## మామ గారి ఆస్తులు అమ్మకం..

హైదరాబాద్ : మేఘా.. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. మనదేశంలోని ప్రధాన రాష్ట్రాల్లోనే కాదు.. ఏకంగా 20 దేశాలలో కార్యకలాపాలు సాగిస్తోంది. కొన్ని దశాబ్దల క్రితం ఒక సాధారణ పైపుల కంపెనీగా ప్రారంభమైంది మేఘా కంపెనీ. పిచ్చిరెడ్డి.. ఆయన మేనల్లుడు కృష్ణారెడ్డి ఈ కంపెనీని నిర్వహిస్తున్నారు.ముఖ్యంగాన్రా రంగంలో ఈ కంపెనీ తిరుగులేని స్థాయిలో ఉంది. 2024 ఎన్నికలకు ముందు దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీల ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసిన కంపెనీల జాబితాలో ఈ సంస్థ రెండవ స్థానంలో ఉంది. కాళేశ్వరం.. పోలవరం హెడ్ వర్క్స్.. జోజిలా అండర్ టన్నెల్.. ఇంకా అనేక రకాల పనులను ఈ కంపెనీ చేపడుతోంది. కృష్ణారెడ్డికి ఇద్దరు కుమారులు. భార్య సుధా రెడ్డి కూడా వ్యాపారంలో ఉన్నారు. ఇటలీలో ఆయిల్ రిగ్గింగ్.. డిఫెన్స్ రంగంలో పరికరాల తయారీ.. ఇంకా అనేక విభాగాలలో కృష్ణారెడ్డి కుమారులు వ్యాపారాలు చేస్తున్నారు. సుధా రెడ్డి కూడా ఫ్యాషన్ ఐకాన్ గా ఉన్నారు. పిచ్చిరెడ్డికి వారసులు లేరు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. పైగా ఈ కంపెనీలో ఉన్న 43 శాతం వాటాను అమ్మాలని.. ఆ బాటను అమ్మితే వచ్చే డబ్బును ఇద్దరి కుమార్తెలకు సమానంగా పంచాలని.. 65 సంవత్సరాలకు మించిన వయసులో ఉన్న తాను హాయిగా రెస్టు తీసుకోవాలని పిచ్చి రెడ్డి అనుకుంటున్నట్టు తెలుస్తోంది.ఈ కంపెనీలో కృష్ణారెడ్డికి ప్రస్తుతం 51 శాతం వాటా ఉంది. మిగతా వాటాను కూడా కొనుగోలు చేస్తే కృష్ణారెడ్డి ఈ కంపెనీకి పూర్తిస్థాయిలో యజమానిగా మారిపోతారు. పిచ్చిరెడ్డి సంబంధించిన వాటాను కొనుగోలు చేయడానికి కృష్ణారెడ్డి అంతర్జాతీయ ప్రైవేట్ క్రెడిట్ ఇన్వెస్టర్ల నుంచి నిధులు సమకూర్చుకుంటున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయం ప్రకారం ఈ డీల్ విలువ దాదాపు 15వేల కోట్ల వరకు ఉంటుందని సమాచారం. ఈ వాటా కొనుగోలు కోసం దాదాపు 6650 కోట్లను ప్రైవేటు ఇన్వెస్టర్ల నుంచి కృష్ణారెడ్డి సమీకరిస్తున్నట్టు సమాచారం.కంపెనీని కొనుగోలు చేసిన తర్వాత నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజిలో లిస్ట్ చేయాలని కృష్ణారెడ్డి అనుకుంటున్నట్టు తెలుస్తోంది. తద్వారా కంపెనీ విలువ పెరుగుతుందని.. గ్లోబల్ వ్యాప్తంగా మరిన్ని ప్రాజెక్టులు చేయడానికి ఆస్కారం ఏర్పడుతుందని కృష్ణారెడ్డి భావిస్తున్నారు.న్రా విభాగంలో తలనొప్పులు విపరీతంగా ఉంటాయి. ప్రాజెక్టులు తీసుకురావడం.. ప్రభుత్వాలతో మాట్లాడటం.. ఏజెన్సీలను ఒప్పించడం.. ఇంకా తెర వెనుక వ్యవహారాలను సాగించడం అంత ఈజీ కాదు. అయితే 65 ఏళ్ల వయసులో తాను ఈ స్థాయిలో ఇబ్బంది పడబోనని పిచ్చిరెడ్డి నిర్ణయించుకున్నారు. అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. పైగా ఇద్దరు కుమార్తెలకు సమానంగా ఆస్తులను పంచి.. విశ్రాంత జీవితాన్ని సుఖంగా గడపాలని పిచ్చిరెడ్డి అనుకుంటున్నారు.పిచ్చిరెడ్డి స్వస్థలం కృష్ణా జిల్లా డోకిపర్రు. ఆ గ్రామంలో అనేక రకాలుగా ఆయన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నో ఆలయాలు కట్టించారు. విశ్రాంత జీవితం మొత్తం డోకిపర్రు లోనే గడపాలని ఆయన నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. అందువల్లే వాటాలు అమ్మి.. ఇద్దరు కుమార్తెలకు సమానంగా ఆస్తులు పంచి.. తన చేతిలో కొంతమేర నగదు ఉంచుకోవాలని పిచ్చిరెడ్డి భావిస్తున్నట్టు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి ఇన్ని రోజులపాటు పిచ్చిరెడ్డి.. కృష్ణారెడ్డి చేతుల్లో ఉన్న మేఘా కంపెనీ పూర్తిగా కృష్ణారెడ్డి చేతుల్లోకి వెళ్లిపోతుండడం నిజంగా వ్యాపార వర్గాలలో సరికొత్త చర్చకు దారితీస్తోంది. మరోవైపు నిధుల సమీకరణ క్రమంలో తన చేతిలో ఉన్న కీలక ప్రాజెక్టులను కేకేఆర్ అనే కంపెనీకి మేఘా విక్రయించబోతున్నట్టు తెలుస్తోంది.

# మంత్రి పదవి రేసులో యశస్విని రెడ్డి..!

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్త సమీకరణాలు.. కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చ
- యువ ఎమ్మెల్యేకు అవకాశం కల్పించాలంటున్న అనుచరులు
- మహిళా ప్రాతినిధ్యం, యువతకు ప్రాధాన్యం కలిసొచ్చేనా..?




సి కే న్యూస్ ,పాలకుర్తి : తెలంగాణ మంత్రివర్గంలో చోటు కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య పోటీ ఆసక్తికరంగా మారుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ మంత్రివర్గం నుంచి వైదొలగడంతో ఏర్పడిన ఖాళీపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఖాళీ అయ్యే స్థానాన్ని ఎవరితో భర్తీ చేస్తారన్నదానిపై కాంగ్రెస్ శ్రేణుల్లో రకరకాల అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పేరు కూడా మంత్రి పదవికి పరిశీలనలో ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**ముందంజలో యశస్విని రెడ్డి..?**

యువ ఎమ్మెల్యేగా పాలకుర్తి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న యశస్విని రెడ్డి.. గత అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై విజయం సాధించి సంచలనం సృష్టించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడిని ఓడించి పాలకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ విజయంతో యశస్విని రెడ్డి యువ నాయకత్వంగా కాంగ్రెస్‌లో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఎన్నికల అనంతరం కూడా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించడంతో పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారని ఆమె అనుచరులు చెబుతున్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకోవడం వంటి అంశాల్లో ఆమె చురుకుదనం చూపుతున్నారని పేర్కొంటున్నారు.

**క్లిష్ట సమయంలో కూడా పార్టీకి అండగా..**

ఎన్నికల అనంతరం రాజకీయంగా పలు సవాళ్లు ఎదురైనప్పటికీ పార్టీని వీడకుండా కార్యకర్తలు, నాయకులకు అండగా నిలిచారనే అభిప్రాయం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉంది. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె వర్గీయులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో యువ ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో అవకాశం కల్పిస్తే పార్టీకి రాజకీయంగా మరింత ప్రయోజనం చేకూరుతుందనే వాదనను ఆమె అనుచరులు తెరపైకి తెస్తున్నారు. ముఖ్యంగా యువతకు ప్రాధాన్యం, మహిళా ప్రాతినిధ్యం, నియోజకవర్గ ప్రాధాన్యత వంటి అంశాలు యశస్విని రెడ్డికి అనుకూలంగా మారవచ్చని అంచనా వేస్తున్నారు.

**మహిళా ప్రాతినిధ్యానికి మరోసారి అవకాశం..?**

ఉమ్మడి వరంగల్ జిల్లాకు గతంలో మంత్రివర్గంలో మహిళలకు ప్రాతినిధ్యం లభించింది. ములుగు ఎమ్మెల్యే ధనసరి అనసూయ (సీతక్క), వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ మంత్రులుగా పనిచేశారు. ప్రస్తుతం కొండా సురేఖ మంత్రివర్గం నుంచి తప్పుకోవడంతో జిల్లాలో ఏర్పడిన రాజకీయ ఖాళీని మరో మహిళా ఎమ్మెల్యేతో భర్తీ చేసే అవకాశం ఉందన్న చర్చ కూడా వినిపిస్తోంది. అదే జరిగితే పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి అవకాశం లభించవచ్చన్న అభిప్రాయం ఆమె అనుచరుల్లో వ్యక్తమవుతోంది. మహిళా నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచనతోపాటు యువతకు ప్రాతినిధ్యం కల్పించాలనే అంశం కూడా పరిగణనలోకి వస్తే ఆమె పేరు బలంగా వినిపించే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.

**సామాజిక.. ప్రాంతీయ సమీకరణాలే కీలకమా..?**

మంత్రివర్గ విస్తరణ లేదా ఖాళీ స్థానాల భర్తీలో కేవలం ఎమ్మెల్యే పనితీరు మాత్రమే కాకుండా సామాజిక, ప్రాంతీయ, రాజకీయ సమీకరణాలు కూడా కీలకంగా మారే అవకాశం ఉంది. జిల్లాల వారీగా ప్రాతినిధ్యం, సామాజిక వర్గాల సమతుల్యత, మహిళలకు అవకాశం, యువ నాయకత్వానికి ప్రాధాన్యం, పార్టీ కోసం చేసిన సేవలు తదితర అంశాలను అధిష్ఠానం పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికే పలువురు సీనియర్ నాయకులు ఎమ్మెల్యేలుగా ఉండటంతో మంత్రి పదవి ఎవరికి దక్కుతుందన్నది ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ పోటీలో సీనియర్లతోపాటు యువ ఎమ్మెల్యేల పేర్లు కూడా తెరపైకి వస్తున్నాయి. దీంతో జిల్లాలోని కాంగ్రెస్ రాజకీయాల్లో మళ్లీ సమీకరణాలు మారే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది.

**అధిష్ఠానం నిర్ణయంపైనే ఉత్కంఠ**

ప్రస్తుతం యశస్విని రెడ్డి పేరు మంత్రి పదవికి పరిశీలనలో ఉందన్న చర్చ అధికారికంగా ధ్రువీకరణ కాలేదు. అయితే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఉత్కంఠగా మారింది. ప్రాంతీయ సమతుల్యత, సామాజిక సమీకరణాలు, పార్టీ భవిష్యత్ రాజకీయ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. పాలకుర్తి వంటి కీలక నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న యువ ఎమ్మెల్యేకు అవకాశం ఇస్తే పార్టీకి సంస్థాగతంగా, రాజకీయంగా మరింత ఊతం లభిస్తుందని యశస్విని రెడ్డి వర్గీయులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా ఉన్న ఆమెకు మంత్రివర్గంలో స్థానం కల్పిస్తే పాలకుర్తితో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి దోహదపడుతుందని వారు చెబుతున్నారు.

**ఎవరి వైపు అధిష్ఠానం..?**

మంత్రి పదవి ఖాళీ కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. సీనియారిటీ, సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం, మహిళా కోటా, యువతకు ప్రాధాన్యం.. ఇలా అనేక అంశాలు చర్చకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో యశస్విని రెడ్డి పేరు తెరపైకి రావడం పాలకుర్తి రాజకీయాల్లో ఆసక్తిని పెంచుతోంది. అయితే చివరికి ఎవరికి అవకాశం ఇవ్వాలన్నది పూర్తిగా పార్టీ అధిష్ఠానం నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునే నిర్ణయంపై ఇప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. యశస్విని రెడ్డికి మంత్రి పదవి దక్కుతుందా..? లేక సీనియర్ నేతకు అవకాశం లభిస్తుందా..? అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## మన సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవి

- ఎమ్మెల్సీ నాగర్కుంట నవీన్ కుమార్ రెడ్డి
- జంగోని గూడలో మైసమ్మ, పోచమ్మ,ఎల్లమ్మ,బొడ్రాయి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం
- ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి రూ.51,000/- విరాళం అందజేత




షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి సెప్టెంబర్ 05 మన సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవని ఎమ్మెల్సీ నాగర్కుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం నందిగామ మండలంలోని జంగోని గూడలో మైసమ్మ,పోచమ్మ,ఎల్లమ్మ, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులకు రూ.51 వేలు విరాళం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మన సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవన్నారు.మైసమ్మ,,పోచమ్మ,ఎల్లమ్మ,బొడ్రాయి తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం గ్రామాల్లో ఘనంగా నిర్వహించడం అనాదిగా వస్తున్న,ఆచారమన్నారు.అమ్మవార్ల ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అంతిరెడ్డిగూడ సర్పంచ్ మంజుల యాదగిరి,వీర్లపల్లి సర్పంచ్ చిందం పాండు,మాజీ సర్పంచులు వంకాయల రామ్ రెడ్డి,సుధాకర్ గౌడ్,జెకే నర్సిమ,ఉపసర్పంచ్ మల్లేష్, నాయకులు జంగ నర్సిమ,జిల్లెల జనార్ధన్ రెడ్డి,జిల్లెల బాల్ రెడ్డి,జంగిలి కుమార్,శ్రీకాంత్ గౌడ్,సుదర్శన్ గౌడ్,కర్ణప్ప,తుమ్మల నర్సిమలు,శివ చారి,చందు,తుప్పుడు క్రిష్ణ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో పాల్గొన్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్

- భవిష్యత్తు భారతదేశం బాలలది.. వారిని తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే
- విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలి
- క్రమశిక్షణ, సమయపాలనతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చు
- విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్
- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన జిల్లా ఎస్పీ




సికె. ప్రతినిధి.ఆదిలాబాద్ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇంద్రవెల్లి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పాల్గొన్నారు. పాఠశాలకు చేరుకున్న జిల్లా ఎస్పీకి విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వర్గీయ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. భవిష్యత్తు భారతదేశం బాలలదని, వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. విద్యార్థులకు కేవలం విద్యాబోధన చేయడమే కాకుండా, వారిలో క్రమశిక్షణ, సమయపాలన, నైతిక విలువలు పెంపొందించి ఉన్నత లక్ష్యాలను సాధించేలా మార్గనిర్దేశం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటిని సాధించేందుకు కష్టపడి చదవాలని సూచించారు. క్రమశిక్షణ, సమయపాలనతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుపైనే పూర్తి దృష్టి సారించాలని సూచించారు. విద్య వ్యక్తిగత అభివృద్ధితో పాటు కుటుంబాల ఆర్థిక, సామాజిక ప్రగతికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులు తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమనిబంధనలు పాటించాలని, తల్లిదండ్రులు హెల్మెట్ ధరించేలా విద్యార్థులు ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం పాఠశాలలోని ప్రతి ఒక్క ఉపాధ్యాయుడిని జిల్లా ఎస్పీ శాలువాతో సత్కరించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు, విద్యార్థులతో కలిసి మాట్లాడుతూ వారి లక్ష్యాలను, వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, సీఐ ఎం. ప్రసాద్, ఎస్ఐ ఈ. సాయన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, కమిటీ చైర్మన్ మనిషా, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తపస్ ఆధ్వర్యంలో ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి,



సెప్టెంబర్ 05 (సీ కే న్యూస్) చేగుంట చేగుంట మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రం వద్ద తపస్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా అతని విగ్రహానికి పూలమాలవేశారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటాం అని, భారతదేశ తొలి ఉపరాష్ట్రపతి మరియు రెండవ రాష్ట్రపతి గా అతడు భారతదేశంలో ఎన్నో సేవలు అందించారని,వారు గొప్ప తత్వవేత్త, విద్యావేత్త, రచయిత మరియు ఆదర్శ ఉపాధ్యాయులు. విద్యకు, ఉపాధ్యాయ వృత్తికి ఆయన ఎంతో గొప్ప గౌరవాన్ని తీసుకువచ్చారు అని, సర్వేపల్లి రాధాకృష్ణన్ దృష్టిలో విద్య అనేది కేవలం పుస్తకాల జ్ఞానం కాదు; అది మనిషిలో మంచి ఆలోచనలు, విలువలు మరియు బాధ్యతను పెంపొందించే సాధనం

అని ఉపాధ్యాయుల పాత్రను ఎంతో ఉన్నతంగా భావించారు వారు అన్నారు.ఆయన జన్మదినాన్ని తన పేరుతో కాకుండా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని కోరడం ఆయనకు ఉపాధ్యాయులపై ఉన్న గౌరవానికి నిదర్శనం అని,

మన జీవితంలో తల్లిదండ్రుల తర్వాత మనకు జ్ఞానాన్ని అందించి, మంచి మార్గాన్ని చూపించే వారు ఉపాధ్యాయులు అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేష్, తంగేళ్లపల్లి కృష్ణమూర్తి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బాలిశెట్టి రేఖ, జిల్లా కార్యవర్గ సభ్యులు పట్లూరి యాదగిరి, దేశపతి కృష్ణమూర్తి, పిట్ల ప్రభాకర్, సుమతి, మండల ఉపాధ్యక్షులు మధునాల శ్రీనివాస్, మండల కోశాధికారి మేముల శ్రీనివాస్, మండల కాంప్లెక్స్ కో కన్వీనర్ చరణ్ దాస్, మండల కార్యవర్గ సభ్యులు, సరస్వతి, శ్రీ వాణి, రమ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా 1,000 రోజుల ప్రజా పాలన బైక్ ర్యాలీ



- కేసీఆర్ రాజీనామా చేసి ప్రజా తీర్పును ఎదుర్కోవాలి: కాంగ్రెస్ నేతల డిమాండ్
- గత పదేళ్ల పాలనపై ప్రజలకు సమాధానం చెప్పాలి: డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేశ్ జాదవ్

సికె.న్యూస్. ప్రతినిధి అదిలాబాద్ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ సాగిస్తున్న పాలనకు 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షులు డా నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో శనివారం భారీ ఎత్తున 1,000 రోజుల ప్రజా పాలన బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ కోమరం భీమ్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్, దేవి చంద్ చౌక్, గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్ వద్ద కార్నర్ మీటింగ్ నిర్వహించి తదనంతరం నెహ్రూ రోడ్డు, నేతాజీ చౌక్, గర్ల్స్ హైస్కూల్ మీదుగా తిరిగి డీసీసీ కార్యాలయానికి చేరుకుంది. మార్గమధ్యంలో కాంగ్రెస్ శ్రేణులు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు

అంబేద్కర్ చౌక్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్లో డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేశ్ జాదవ్ తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేశారు. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ తన పాలనకు సంబంధించిన ప్రజా సమస్యలపై సమాధానం చెప్పాలని, రాజకీయ బాధ్యత స్వీకరించి రాజీనామా చేసి ప్రజా తీర్పును ఎదుర్కోవాలని అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు తదితర అంశాల్లో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలకు గత ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేశ్ జాదవ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతోందన్నారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రజలకు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాక అర్హులైన ప్రతి యొక్క పేదలకు రేషన్ కార్డు అందించామని, అరువైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తున్నామని అలాగే మహిళలకు ఫ్రీ బస్సు , 200 యూనిట్ల ఉచిత కరెంటు,500 లకే గ్యాస్ సిలిండర్ ఇలా ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.తెలంగాణ ముఖ్యమంత్రి గౌ రేవంత్ రెడ్డి గారు కాంగ్రెస్ అగ్రనేత లిరాహుల్ గాంధీలిపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలకు డిసిసి అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ స్పందిస్తూ వ్యక్తిగత విమర్శలకు పరిమితం కాకుండా ప్రజా సమస్యలు, నిరుద్యోగం, రైతుల సమస్యలు, సంక్షేమం, అభివృద్ధి వంటి అంశాలపై రాజకీయ చర్చ జరగాలని వారు పేర్కొన్నారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలపై కూడా కాంగ్రెస్ నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల సమస్యలు, సామాన్య ప్రజల సంక్షేమం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.

రాబోయే రోజుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాపురావు గారు , బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ గారూ , గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య , మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి,మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత , మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి , బూత్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి , ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ గారు, ఐఎన్టీయూసీ నాయకుడు మునిగేలా నర్సింగ్, యూత్ కాంగ్రెస్ నాయకుడు చరణ్ గౌడ్ గారు , జిల్లా మీడియా కోఆర్డినేటర్ మేకల జితేందర్ ,ఎస్సీ విభాగం చైర్మన్ పరమేశ్వర్ , ఎన్ ఎస్ యు ఐ కపిల్ గారు, లీగల్ సెల్ అధ్యక్షులు మంగేష్ మహిళా కాంగ్రెస్ అన్నపూర్ణ సేవాదళ్ మోతి రాం మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్ , మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఇజ్జగిరి సంజయ్ , మున్సిపల్ కౌన్సిలర్లు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాకీ కార్డులతో కాంగ్రెస్‌ను నిలదీసిన బీఆర్ఎస్!గరిడేపల్లిలో బాకీ కార్డుల పంపిణీ

- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి




**, గరిడేపల్లి: సికే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** హామీలు అబద్దాలతో ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన వెయ్యి రోజుల పాలన విఫలమైందని హుజూర్నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి అన్నారు మండల కేంద్రమైన గరిడేపల్లి లో శనివారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి బాకీ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో అమలు కాని హామీలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, అయితే వెయ్యి రోజులు గడుస్తున్నా అనేక హామీలు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు.ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, అమలు కాని హామీలను గుర్తు చేస్తూ గ్రామగ్రామాన బాకీ కార్డులను పంపిణీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయనున్నట్లు ఆయన తెలిపారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.ఆరు గ్యారంటీల అమలు పరిస్థితిపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని ఆయన కోరారు.

నేటి నుంచి గ్రామగ్రామాన బాకీ కార్డుల పంపిణీతో పాటు ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.రైతుల సమస్యలు, వ్యవసాయానికి సాగునీరు, సంక్షేమ పథకాల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. సాగర్ ఆయకట్టుకు సాగునీరును యధావిధిగా కొనసాగించాలని లేనిపక్షంలో రైతుల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కడియం స్వప్న, పెండెం వీరయ్య గౌడ్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి మన్సూర్ అలీ, పెండెం ధనయ్య గౌడ్, రాజమల్లు, నగేష్, వేణు, వెంకటేష్, లింగయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభల గోడ పోస్టర్లు విడుదల

- జిల్లా సహాయ కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి




**గరిడేపల్లి సి కె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** మండల కేంద్రంలో ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని గోడ పోస్టర్లను విడుదల చేశారు ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ సూర్యాపేట జిల్లా సహాయ కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ 6 7 8 తేదీలలో కరీంనగర్ లో జిల్లా కేంద్రంలో జరిగే ఏఐటీయూసీ నాలుగవ రాష్ట్ర మహాసభల కు గరిడేపల్లి మండలం నుంచి కార్మికులు వివిధ సంఘాల బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ మహాసభలు ఎంతో ప్రత్యేకమైనవి అని అన్నారు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారుల కార్పొరేట్ యజమానుల ఆస్తులను పెంచేందుకు కుట్రలు చేస్తూ ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారని అన్నారు 100 సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడలుగా తీసుకువచ్చిందనివర్షించారు కార్మిక హక్కులను కాలరాస్తున్నారు కార్మికులు అప్రమత్తమై కరీంనగర్ లో జరిగే ఏ ఐ టి సి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు ఈ మహాసభలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి సంఘటిత అసంఘటిత కార్మికుల సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గరిడేపల్లి మండల నాయకులు బండ్ల ఆనందరావు గుగులోత్ రవి నాయక్ గుర్రం రమేష్ మచ్చ సుగుణ సుబ్బయ్య ఆంజనేయులు బిక్షం తదితరులు పాల్గొన్నారు

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన నాగులవంచ గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి** నాగులవంచ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం నందు వాసన్ ఐ కేర్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నాగులవంచ గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి ప్రారంభించారులి

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేసినటువంటి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో శ్రీ గజగిరి లక్ష్మీనరసింహస్వామి మరియు శ్రీ కోదండరామస్వామి దేవాలయ చైర్మన్ ముత్తినేని వెంకటేశ్వరరావులి

దేవాలయ కమిటీ సభ్యులు వెచ్చ మంగపతి రావు

మాజీ దేవాలయ చైర్మన్ నారగాని శ్రీనివాసరావు

గ్రామ పెద్దలు మద్దినేని వెంకటేశ్వరరావు సిలివేరు సైదులు అంబటి నాగేశ్వరరావు గార్లపాటి సుదర్శన్ రావు బల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు






**సికే న్యూస్ ప్రతినిధి ఖమ్మం:** ఖమ్మం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో గల శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా భారతదేశ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో పాఠశాలకు హాజరై, ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ తమ తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఉపాధ్యాయుల బాధ్యతలు, వారి ప్రాముఖ్యతను స్వయంగా అనుభవిస్తూ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా తెలియజేశారు. ఆయన గొప్ప తత్వవేత్త, విద్యావేత్తగా మాత్రమే కాకుండా భారతదేశ ఉపరాష్ట్రపతిగా కూడా సేవలందించారు. సమాజ అభివృద్ధికి అవసరమైన జ్ఞానం, విజ్ఞానం, విలువలను విద్యార్థులకు అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి జీవితాన్నే కాకుండా మొత్తం సమాజ భవిష్యత్తును సైతం మార్చగలడని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రావూరి నివేదిత మాట్లాడుతూ, ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించడం మాత్రమే కాకుండా విద్యార్థుల్లో జ్ఞానం, క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తారని అన్నారు. ఎన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలు అందుబాటులోకి వచ్చినా ఉపాధ్యాయుల ప్రాముఖ్యత ఏమాత్రం తగ్గదని పేర్కొన్నారు. శ్రీ చైతన్య పాఠశాలల్లో విద్యార్థుల్లోని సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించే విధంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. విద్యార్థులను ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించడంలో పాఠశాల యాజమాన్యం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ , డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం చేతన్ మధుర్ , ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జల్దా గ్రామంలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం



- 60 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, ఒక కారును తనిఖీ
- 173 ఈ-చలాన్ కేసుల్లో రూ.37,941/- చెల్లింపు
- రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచన
- గంజాయి, మాదకద్రవ్యాలు, గుడుంబా, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి
- ఇచ్చోడా ఎస్ హెచ్ ఓ కే నరేష్ కుమార్

**సికె.న్యూస్.ఆదిలాబాద్ :**ఇచ్చోడ మండలం జల్దా గ్రామంలో ఇచ్చోడ పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

తనిఖీల్లో భాగంగా 60 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, ఒక కారును తనిఖీ చేసి వాహనదారులకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాల ఈ-చలాన్‌లను పరిశీలించగా 173 కేసులకు సంబంధించి రూ.37,941/- జరిమానాలు వాహనదారులు చెల్లించడం జరిగింది.

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు. వాహనాలకు సంబంధిత పత్రాలు, నంబర్ ప్లేట్లు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు.

అదేవిధంగా యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు, గుడుంబా వంటి నిషేధిత పదార్థాలకు దూరంగా ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. గ్రామంలో ఎలాంటి అనుమానాస్పద లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇచ్చోడా ఎస్ హెచ్ ఓ కె నరేష్ కుమార్, గుడియత్నూర్ ఎస్సై ఎల్ శ్రీకాంత్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్

**సికె.న్యూస్. బజారత్నూర్** బజార్ హత్నూర్: మండలంలోని గిర్నూర్ గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా గిర్నూర్ యాదవ సంఘ భవనంలో నిర్వహించిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి ఈ వేడుకల్లో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పాల్గొని శ్రీ కృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు

ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రైతులు, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ కృష్ణ భగవానుడిని ప్రార్థించారు ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, గిర్నూర్ సర్పంచ్ ప్రియాంక భీమేష్, బజార్ హత్నూర్ మండల అధ్యక్షుడు కళ్ళెం విఠల్, టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కుర్మే మహేందర్, జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మెత నర్సయ్య, మండల ఉపాధ్యక్షులు



రాథోడ్ రమేష్, మల్లెపూల నారాయణ,జాదవ్ గణేష్ ,ప్రధాన కార్యదర్శి గొల్లనాగు రమేష్,సురేష్ రెడ్డి, బుక రాములు,యండి సద్దాం,విలాస్,మౌలానా, యాదవ సంఘ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు

## శ్రీ గ్లోబల్ హై స్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను కొనియాడిన పాఠశాల డైరెక్టర్ ఇనుకుల్ల దివాకర్ రెడ్డి**




**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**, సెప్టెంబర్ 5: నాగులవంచలోని శ్రీ గ్లోబల్ హై స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ఉపరాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఇనుకుల్ల దివాకర్ రెడ్డి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి అందించిన విశిష్ట సేవలను, విద్యారంగానికి చేసిన కృషిని కొనియాడారు.

ఈ సందర్భంగా దివాకర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా, విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యత, ఆత్మవిశ్వాసం వంటి సద్గుణాలను పెంపొందిస్తూ సమాజానికి మంచి పౌరులను అందిస్తారని తెలిపారు. గురువుల మార్గదర్శకత్వం విద్యార్థుల జీవితానికి దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తమ గురువుల పట్ల గౌరవం, అభిమానాన్ని చాటుకున్నారు.ఉపాధ్యాయుల సేవలను స్మరించుకుంటూ ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య సభ్యులు ఇనుకుల్ల దివాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, వాహిని, పాఠశాల ప్రిన్సిపల్ తన్నీరు రామారావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బాకీ కార్డులు కరపత్రాలు ఆవిష్కరణ కాంగ్రెస్ మోసాలను ప్రజలకుతెలియజేయాలి

- మాజీ మండల పార్టీ అధ్యక్షులు గుగులోతు కృష్ణ నాయక్



**గరిడేపల్లి సీకే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు**

గరిడేపల్లి మండలం లో ఉన్న ప్రతి గ్రామపంచాయతీలో గ్రామంలో ప్రతిఇంటింటికి కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను పంచి కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను ప్రజలకు వివరించాలని గరిడేపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు గుగులోతు కృష్ణ నాయక్ మరియు మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి అన్నారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ బాకీ కార్డుల కరపత్రాలను ఆవిష్కరణ చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి వంద రోజులు అయిన తర్వాత అన్ని హామీలు పూర్తి చేస్తామని చెప్పి కనీసం 1000.ఈ రోజులు అవుతున్నా కూడా ఏ ఒక్క హామీ కూడా అమలు చేయడంలో విఫలమైందని వారు అన్నారు ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు తులం బంగారం హామీ తుంగలో తొక్కారని 6000 పింఛను అడుగంటు పోయిందని మహిళలకు 2500 నోటి మాటలకే పరిమితమైందని వికలాంగులకు 6000 వింతగా మారిందని అనేక రకాలైన హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని వారు అన్నారు గ్రామాలలో ఉన్న ప్రజలకుబి ఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతి ఇంటింటికి వెళ్లి వారి మోసాలను వివరించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సింగిల్ విండో మాజీచైర్మన్ వీరం రెడ్డి శశిబి రెడ్డి మాజీ వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీల వెంకటరమణారెడ్డి కల్మలచెరువు సర్పంచ్ బచ్చలకూరి శీను కొత్తగూడెం సర్పంచ్ సుధా నాగరాజు అధికార ప్రతినిధి రామ్ సైదులు మలిదశ ఉద్యమకారులు పెండెం ధనయ్య లల్లి రాజమల్లు సతీష్ వెంకటేష్ వార్డు మెంబర్ నాగయ్య నరేందర్ నాయక్ వేణు తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మోతిలాల్ నాయక్



**కోదాడ సికె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** మండల పరిధిలో ఉన్న యర్రవరంజిల్లాపరిషత్ఉన్నతపాఠశాలలోజాతీయ ఉపాధ్యాయదినోత్సవంసందర్భంగా. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళాఉపాధ్యాయినిలకు. సభాధ్యాక్షులుపాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీగుగులోతు మోతిలాల్ నాయక్ అధ్యక్షతనపద్మ,ఆండాలమ్మ,నాగేంద్రమ్మ,అనీత ను ఘనంగాసన్మానించారు. ఈకార్యక్రమంలోసీనియర్ ఉపాధ్యాయులుజి. వీరాచారి,యం. జోజిరెడ్డి,డి. బాలాజీ,పద్మ,ఆండాలమ్మ,నాగేంద్రమ్మ,అనీత,రామానాయక్,విద్యార్థిని-విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగాపాఠశాల ప్రధానోపాధ్యాయులుమాట్లాడుతూదీపంలోనూనే ఉన్నంతసేపూమాత్రమేవెలుగునుప్రసరిస్తుందికానీ ఉపాధ్యాయులబోధనాపద్ధతులను సరిగ్గావిద్యార్థులు అర్థం చేసుకున్నట్లయితే వారికి సమాజంలోగర్వించదగ్గస్థాయిలోగుర్తింపులభిస్తుందిఅని తెలియజేశారు

# మౌలిక వసతులను ఏర్పాటు చేయని ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలు ప్రభుత్వ

- పాఠశాలలను పరిశీలించిన సిపిఎం పార్టీ బృందం.
- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్.



**సి.కే న్యూస్ ప్రతినిధి ఖమ్మం:**రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందని ప్రచారాలు ఆర్భాటాలు తప్ప పేదవాడికి విద్య అందని ద్రాక్షలా మారిందని పాఠశాలలోని కనీస మౌలిక వసతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయటం లేదని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మద్దాల ప్రభాకరరావు విమర్శించారు.

ఎర్రుపాలెం మండల పరిధిలోని మాము నూరు గ్రామంలో గల జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, మండల ప్రజా పరిషత్ పాఠశాల, ఫ్రీ ప్రైమరీ పాఠశాలలను సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నాయకులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ మండల పరిషత్ పాఠశాల స్థితిగతులు,నలుగురు ఉపాధ్యాయులు ఉండవలసిన పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉపాధ్యాయులు లేకుండా ఏ రీతిగా అందిస్తారని ప్రశ్నించారు.పాఠశాల శిథిలావస్థలో పడిపోయే పరిస్థితులలో ఉందని,విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు లేవని ఉపాధ్యాయులు బోధించే కనీస బ్లాక్ బోర్డు కూడా లేదని విద్యార్థులకు బోధనలో మార్పులు తెస్తానని చెబుతున్న ఈ ప్రభుత్వం పాఠశాలలో బ్లాక్ బోర్డు లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.

జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల,

పాఠశాలలో విద్యార్థులు త్రాగునీరు లేక కలుషితమైన మంచినీరు త్రాగుతున్నారని అనారోగ్యాల పాలవుతున్నారని డ్రింకింగ్ వాటర్ పరికరశీ చెడిపోతే బాగు చేయించే నాథుడు లేక పక్కన పడవేశారని మంచినీరు కోసం విద్యార్థులు పలు ఇబ్బందులు చెందుతున్నారని వాటర్ ట్యాపులు కూడా సరిగా పనిచేయటం లేదని విమర్శించారు. మరుగుదొడ్లు లేక ఆరుబయట మూత్ర విసర్జన చేస్తున్నారని పాఠశాల ఆవరణ మొత్తం పిచ్చి చెట్లు ముల్ల కంప చెట్లు తో నిండిపోయాయని అపరిశుభ్రంగా ఉందని పాములు తదితర క్రిమి కీటకాలకు నిలయంగా మారిందని అన్నారు. పాఠశాలలలో కనీస మౌలిక వసతులను కూడా ఏర్పాటు చేయ లేని ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఏ రకంగా అందిస్తుందని ప్రశ్నించారు. విద్యలో పెను మార్పులు తెచ్చి విద్య అభివృద్ధికి ప్రభుత్వం కంకణం కట్టుకొని ఉందని బహిరంగ సభలలో డబ్బా వాయించుకోవడం కాదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం,ఉన్నత విద్య శాఖ అధికారులు వెంటనే స్పందించి మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ లాల సాహెబ్,కన్నెబోయిన శ్రీనివాసరావు,షేక్ కరీం, శీలం వెంకటేశ్వరరావు, రాణీ,షేక్ మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన రహదారికి మహర్దశ.. నీలిపల్లి అభివృద్ధిలో మరో ముందడుగు...

సర్పంచ్ డీకే శ్రీదేవి ఆంజనేయులు.





**మల్దకల్ సెప్టెంబర్ 5:**జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం నీలిపల్లి గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ నీలిపల్లి గ్రామాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్తున్నారు సర్పంచ్ డీకే శ్రీదేవి ఆంజనేయులు. నీలిపల్లి గ్రామంలోని స్మశాన వాటికకు వెళ్లే రహదారి గత కొంతకాలంగా అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా అంత్యక్రియల సమయంలో రహదారి సరిగా లేకపోవడంతో ప్రజలకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఈ సమస్యను గుర్తించిన సర్పంచ్ డీకే శ్రీదేవి ఆంజనేయులు గ్రామపంచాయతీ సెక్రటరీ, వార్డు సభ్యులతో కలిసి స్మశాన వాటిక రహదారి మరమ్మతులకు చర్యలు చేపట్టి.రహదారిని అవసరమైన విధంగా సరిచేసి ప్రజల రాకపోకలకు అనుకూలంగా తీర్చిదిద్దారు.దీంతో స్మశాన వాటికకు వెళ్లే ప్రజలకు ఇబ్బందులు తొలగిపోయాయి.

గ్రామ అభివృద్ధిలో భాగంగా కేవలం ప్రధాన రహదారులకే కాకుండా ప్రజలకు అవసరమైన ప్రతి మౌలిక వసతిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, గ్రామపంచాయతీ సెక్రటరీ, వార్డు సభ్యుల సమన్వయంతో వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్మశాన వాటిక రహదారికి మరమ్మతులు చేపట్టడంతో గ్రామ ప్రజలు సర్పంచ్ డీకే శ్రీదేవి ఆంజనేయులు, గ్రామపంచాయతీ సెక్రటరీ, వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగిస్తూ నీలిపల్లి గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.

# యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్





- హామీలు గుప్పించి అధికారంలోకి.. అమలు చేయకుండా నిరుద్యోగ యువతను నట్టేట ముంచారు
- నాగులవంచలో బీఆర్ఎస్ యువత సమరభేరి.. కాంగ్రెస్ ప్రభుత్వంపై నేతల ధ్వజం
- కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణలు మానుకోవాలి.. అభివృద్ధిలో పోటీ చేయలేక అబద్ధాల్లో పోటీ పడుతున్న కాంగ్రెస్--నామా నాగేశ్వరరావు
- వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో హామీలన్నీ గాలికే.. నిరుద్యోగ యువతను దారుణంగా మోసం చేసిన ప్రభుత్వం--లింగాల కమల్ రాజు

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని, సెప్టెంబర్ 5:** మండల పరిధిలోని నాగులవంచలో వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనను ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువత సమరభేరి కార్యక్రమంలో మాజీ ఎంపీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నామా నాగేశ్వరరావు, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలపై ర్యాలీ నిర్వహించిన అనంతరం నాగులవంచ సెంటర్‌లో వంటావార్పు కార్యక్రమంతో నిరసన తెలిపారు. అనంతరం వంకాయలపాటి సత్యనారాయణ నివాసం వద్ద షేక్ రహమతుల్లా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు ప్రసంగించారు.

తెలంగాణ కోసం తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కేసీఆర్ అని నామా నాగేశ్వరరావు అన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధితో పోటీ పడలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అబద్ధాలు చెప్పడంలో పోటీ పడుతోందని ఎద్దేవా చేశారు.

రాజకీయ విమర్శల పేరుతో కేసీఆర్‌ను వ్యక్తిగతంగా దూషించడం కాంగ్రెస్ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని నామా అన్నారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో యువతకు పెద్దపీట వేసి ఉద్యోగ కల్పనకు కృషి చేశారని, కేటీఆర్ నాయకత్వంలో ఐటీ రంగానికి పెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, మూడు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ఆరు లక్షల ఉద్యోగాల భర్తీపై సమాధానం చెప్పాలని నామా డిమాండ్ చేశారు.

ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది నిరుద్యోగ యువతను ప్రభుత్వం తీవ్ర నిరాశలోకి నెట్టిందని ఆరోపించారు. యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో వందలాది హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయినా వాటిని సక్రమంగా అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.

ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆరు లక్షల ఉద్యోగాలు ఎందుకు భర్తీ చేయలేదని ప్రశ్నించారు. ఉద్యోగాలు లేక విద్యావంతులైన యువత తీవ్ర నిరాశలో ఉందని, యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రాజీవ్ యువ వికాసం పేరుతో స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి యువతను మోసం చేశారని విమర్శించారు. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో విఫలమై, మరోవైపు స్వయం ఉపాధి పథకాలను కూడా అమలు చేయకుండా నిరుద్యోగ యువత ఆశలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థినులకు స్కూటీలు అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే జీవో 97ను వెంటనే రద్దు చేయాలని కోరారు.

మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, దివ్యాంగులకు రూ.6,000, రైతులు, రైతు కూలీలు, ఆటో కార్మికులు సహా వివిధ వర్గాలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అమలు కాని వాగ్దానాలను ప్రతి గ్రామానికి తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ శ్రేణులకు నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, యువజన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోవు అంజమ్మ సేవలు మరువలేనివి,

రంగాపూర్ మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,



**షాద్ నగర్ నియోజకవర్గ సీకే న్యూస్ ప్రతినిధి, సెప్టెంబర్ 05:**రంగాపూర్ సర్పంచ్‌గా రెండు పర్యాయాలు పనిచేసి ప్రజలకు అందించిన గోవు అంజమ్మ సేవలు మరువలేనివని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గోవు అంజమ్మ కుటుంబ సభ్యులను శనివారం నందిగామ మండలం చలివేంద్రగూడలోని వారి స్వగృహానికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు ఈ సందర్భంగా అంజమ్మ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజా జీవితంలో ఉంటూ రంగాపూర్ గ్రామ సర్పంచ్‌గా రెండు పర్యాయాలు పనిచేసిన గోవు అంజమ్మ గ్రామ అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు ఆమె మృతి కుటుంబ సభ్యులతో పాటు గ్రామ ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు అంజమ్మ కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, కష్టకాలంలో వారికి తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు ఎమ్మెల్యే వెంట నాయకులు శివశంకర్ గౌడ్, సుదర్శన్ గౌడ్, తిరుపతిరెడ్డి, కొమ్ము కృష్ణ, కావలి కృష్ణ, జ్ఞానేశ్వర్, రవీందర్ గౌడ్ గబ్బ చౌహాన్, రాజు నాయక్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా... కొండపల్లిలో సర్పంచ్ కృష్ణారెడ్డి సేవా దృక్పథం...

**గద్వాల సెప్టెంబర్ ఐద 05:**

జోగులాంబ గద్వాల జిల్లా కొండపల్లి గ్రామంలోని విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి సర్పంచ్ కృష్ణారెడ్డి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. కొండపల్లి గ్రామంలోని పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన దుస్తులను సర్పంచ్ కృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు దుస్తులు అందజేసి, ప్రభుత్వం విద్యార్థుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి విద్యార్థి మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకం, విద్యా సహాయ కార్యక్రమం, అవసరమైన సదుపాయం వచ్చినా వాటిని అర్హులైన ప్రతి విద్యార్థికి చేరేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలిసి ముందుండి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు ప్రభుత్వం అందించే దుస్తులు, పుస్తకాలు, ఇతర విద్యా సంబంధిత ప్రయోజనాలు సకాలంలో అందేలా పాఠశాల యాజమాన్యంతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రధానోపాధ్యాయులు తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

### విద్యార్థుల అభివృద్ధికి నిరంతర సహకారం

గ్రామాభివృద్ధిలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉందని సర్పంచ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలిసి పనిచేస్తామని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, కొండపల్లి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం వెనుక ఉన్న ఉద్దేశం విద్యార్థుల విద్యాభివృద్ధి, భవిష్యత్తుకు తోడ్పాటు అందించడమేనని, అందువల్ల అర్హులైన ప్రతి విద్యార్థికి పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ స్పష్టం చేశారు.

### సర్పంచ్ హామీపై విద్యార్థులు, తల్లిదండ్రుల హర్షం

ప్రభుత్వం అందించిన దుస్తులను సర్పంచ్ కృష్ణారెడ్డి చేతుల మీదుగా అందుకోవడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సర్పంచ్ ముందుండి సహకరిస్తామని హామీ ఇవ్వడంపై తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో విద్యార్థుల సంక్షేమానికి సర్పంచ్ చూపుతున్న చొరవ అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

"విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన సహకారం అందిస్తూ, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రతి విద్యార్థికి చేరవేయడమే తమ లక్ష్యం" అని సర్పంచ్ కృష్ణారెడ్డి తెలిపారు.



# అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందిస్తాం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- కొత్తూర్ మున్సిపాలిటీ కార్యాలయం లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి సెప్టెంబర్ 05 :** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం కొత్తూరు మున్సిపాలిటీ కార్యాలయంలో కొత్తూరు మండల లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు మాట్లాడుతూ...గతంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి పాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించడంతో పాటు, అవసరమైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం నేడు అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందించే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.గత ప్రభుత్వ హయాంలో రేషన్ ద్వారా అందించే బియ్యం నాణ్యత సరిగా లేకపోవడంతో పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే విమర్శించారు. గల్లీ గల్లీలో దళారులు ఆటోల్లో వచ్చి పేదల వద్ద నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసేవారని, అనంతరం రైస్ మిల్లర్లు ఆ బియ్యాన్ని కొనుగోలు చేసి పాలిష్ చేసి తిరిగి మార్కెట్‌లో పేదలకే విక్రయించేవారని ఆరోపించారు.ప్రజలకు నాణ్యమైన బియ్యం అందించడంతో పాటు సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. ఇంకా రేషన్ కార్డు పొందని అర్హులైన కుటుంబాలు ఉంటే వారికి కూడా రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు మరింత పారదర్శకంగా, సులభంగా సేవలు అందుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, కొత్తూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, నందిగామ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుమారస్వామి గౌడ్, నాయకులు నర్సప్ప గూడ క్రిష్ణ, అగీర్ రవికుమార్ గుప్తా, కొత్తూరు తహసీల్దార్ మసూద బేగం, మున్సిపల్ కమిషనర్ సాహితీ రెడ్డి, సర్పంచులు దయానంద్, శ్రీరాములు, గోవిందు, విష్ణు ,కాంగ్రెస్ పార్టీ నేతలు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# చింతకానిలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

## ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనది.. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో గురువులదే కీలకపాత్ర



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని, సెప్టెంబర్ 5:** చింతకాని మండలంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శుక్రవారం రైతు వేదికలో ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) సలాది రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్సై నరేష్, సర్పంచ్ కిలారి మనోహర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలంలోని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ కిలారి మనోహర్ మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత స్థాయికి తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవప్రదమైనదని, సమాజ నిర్మాణంలో గురువుల సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఉపాధ్యాయులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

ఎస్సై నరేష్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ కోసం ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి వ్యక్తిత్వ వికాసానికి కూడా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు.

ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకు సన్మానం

ఈ సందర్భంగా మండలంలోని పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చిరంజీవి నాయుడు, రాజయ్య, కే. శ్రీనివాసరావు, యు. నాగేశ్వరరావు, వి. శకుంతల, ఆర్. ఇందిర, పి. లక్ష్మీరాజ్యం, కేజీబీవీ వై. కళావతి తదితర ఉపాధ్యాయులను ఎంఈఓ సలాది రామారావు మెమొంటో, శాలువా, ప్రశంసా పత్రంతో సత్కరించారు.

కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన సంఘ నాయకులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండలంలోని ఉపాధ్యాయులను ఈ సందర్భంగా

# సిగరెట్ షాప్‌లో చోరీ -- రాజస్థాన్‌కు చెందిన 5 గురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్




**సికె.న్యూస్. ప్రతినిధి.ఆదిలాబాద్**

సిగరెట్ షాప్ తాళాలు పగులగొట్టి రూ.5.35 లక్షల విలువైన సిగరెట్ బాక్సులు చోరీ

నిందితుల నుంచి రూ.60,000 నగదు, చోరీకి ఉపయోగించిన కారు, 3 సెల్ ఫోన్లు, ఒక గడ్డపార స్వాధీనం

ఆదిలాబాద్‌లో మరో చోరీకి రెక్కీ నిర్వహిస్తుండగా పోలీసులకు చిక్కిన నిందితులు

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్

అరెస్టయిన నిందితులు:

1: కుమావత్ బుందారం (38), o/శీ కర్ణ రామ్ దేవారియా రోడ్, జైతారం, పాలీ జిల్లా రాజస్థాన్,

2: కుమావత్ ఘనశ్యామ్ (42) o/శీ బగ్గా రాంజీ, బంజాకూరి, జైతరం, పాలీ జిల్లా రాజస్థాన్

3: కుమావత్ మాణిక్ చంద్ (35), బీరోల్, జైతరం, పాలీ జిల్లా రాజస్థాన్

4: కుమావత్ లక్ష్మణ్ (45) నా/శీ బుధారం, హపత్, జైతరం పాలీ జిల్లా రాజస్థాన్.

నా5: తేజ్పాల్ సింగ్ (28) నా/శీ జగదీష్ ప్రసాద్, బండ్లగూడ, నేతాజీ నగర్, పఠాన్చెరు, హైదరాబాద్.

ఆదిలాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్ ప్రాంతంలో సిగరెట్ షాప్‌లో చోరీకి పాల్పడిన రాజస్థాన్‌కు చెందిన నలుగురు అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు ముందుగా షాప్ వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి సమయంలో గడ్డపారతో షాప్ తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి వివిధ రకాల సిగరెట్ బాక్సులతో పాటు కౌంటర్‌లోని నగదును చోరీ చేశారు.

చోరీ చేసిన సిగరెట్లను హైదరాబాద్‌లోని పఠాన్‌చెరులో తమకు పరిచయమైన వ్యక్తికి విక్రయించేందుకు ప్రయత్నించారు. సిగరెట్ల మొత్తం విలువ సుమారు రూ.5.35 లక్షలు ఉన్నట్లు నిందితులు వెల్లడించారు. కొంత మొత్తానికి సిగరెట్ బాక్సులను విక్రయించి, వచ్చిన నగదును నలుగురు పంచుకున్నట్లు విచారణలో తెలిపారు.

తదుపరి మిగిలిన సిగరెట్ బాక్సులను విక్రయించేందుకు, అలాగే ఆదిలాబాద్‌లో మరో చోరీకి పాల్పడే ఉద్దేశంతో నిందితులు తిరిగి ఆదిలాబాద్‌కు వచ్చారు. సిగరెట్ బాక్సులను విక్రయిస్తున్న సమయంలో పోలీసులు వారిని గుర్తించి పట్టుకునేందుకు ప్రయత్నించగా, నిందితులు అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించగా సిగరెట్ షాప్‌లో చోరీ చేసినట్లు అంగీకరించారు.

స్వాధీనం చేసుకున్న సొత్తు:

American Cigarettes -- 27 సెట్స్
King Size Gold Cigarettes -- 10 సెట్స్
Light Gold Flak Cigaretteo -- 11 సెట్స్
Small Gold Flak Cigarettes -- 14 సెట్స్
Bristol Cigarettes -- 14 సెట్స్
Classic Mils Red Cigarettes -- 1 సెట్
Old Addition Cigarettes -- 21 సెట్స్
Ice Bust Cigarettes -- 2 సెట్స్
Connect Cigarettes -- 1 సెట్
*Silk Cigarettes* -- 1 సెట్
నగదు -- రూ.60,000/-
మారుతి వాగన్ ఆర్ కారు --
4 సెల్ ఫోన్ లు మరియు ఒక గడ్డపార, హ్యాండిల్

విచారణలో నిందితులు గతంలో మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్, --హైదరాబాద్ హైవే పక్కన ఉన్న పాన్ డబ్బాను పగులగొట్టి నగదు చోరీ చేసినట్లు కూడా వెల్లడించారు.

నిందితులు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో స్నేహితులతో కలిసి అంతర్రాష్ట్ర పరిధిలో చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.. గతంలోని నిందితులపై ఏడు అంతర్రాష్ట్ర కేసులు ఉన్నట్లు తెలిపారు. దాదాపు దొంగలించిన సొత్తులో 80% రికవరీ జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, ఎస్సైలు నాగనాథ్, అశోక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాటూరు పేట సర్పంచ్ ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**మధిర సెప్టెంబర్ 05(సికెన్యూస్)ప్రతినిధి.** మధిర మండలం మాటూరుపేట గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను మాటూరు పేట గ్రామ సర్పంచ్ చిలువేరు పూర్ణమ్మ లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా బేతంపూడి ముక్కంటికి రూ.22,000, దనిశెట్టి నాగలక్ష్మికి రూ.15,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ పూర్ణమ్మ తన చేతుల మీదుగా అందజేశారు.



ఆపద సమయంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని సర్పంచ్ పూర్ణమ్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి, సీఎంఆర్ఎఫ్ సహాయం అందేలా కృషి చేసిన తెలంగాణ డిప్యూటీ సీఎం శ్రీ మల్లు భట్టి విక్రమార్క కి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు తల్లపురెడ్డి కృష్ణారెడ్డి , సీనియర్ నాయకులు మాదల రామారావు, మాదల రాంబాబు ,పుప్పాల వెంకటేశ్వరరావు,మండల బీసీ సెల్ అధ్యక్షులు చిలువేరు బుచ్చి రామయ్య, చిలువేరు శాంతయ్య,ఎస్సీ సెల్ అధ్యక్షులు రెంటపల్లి శ్రీనివాసరావు , చీదిరాల నాగేశ్వరావు, దనిశెట్టి మురళి,పెద్దలు అన్నెం కోటేశ్వరావు,దాసు, పాల్గొన్నారు.


# నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు

**మధిర సెప్టెంబర్ 05 (సికె న్యూస్)ప్రతినిధి.** హైదరాబాద్ కూకట్‌పల్లిలోని సమ్మెట్ రెసిడెన్సీ అపార్ట్మెంట్‌లో నిర్వహించిన నూతన గృహప్రవేశ వేడుకలకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు హాజరయ్యారు.

కర్నాటి వెంకటేశ్వరరావు--రాజేశ్వరి దంపతుల కుమార్తె కావ్య, అల్లుడు శ్రీకాంత్ దంపతుల నూతన గృహప్రవేశం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో కర్నాటి రామారావు పాల్గొన్నారు. నూతన గృహంలో దంపతులు చేపట్టిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని, వారిని ఆశీర్వదించి సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నూతన జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు.

గుడిమళ్ల శ్రీకాంత్ తల్లిదండ్రులు విష్ణుమూర్తి--అమల దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆత్మీయ గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న కర్నాటి రామారావు, నూతన దంపతులకు, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.





# పాలంపల్లి లో మల్లారెడ్డి హాస్పిటల్ యాజమాన్యం, ఉచిత వైద్య శిబిరం,







**సెప్టెంబర్ 05 సీ కే న్యూస్ చేగుంట :** మెదక్ జిల్లా చేగుంట మండల్ గ్రామం పొలంపల్లిలో, మల్లారెడ్డి హాస్పిటల్ వైద్య శిబిరం సూరారం వైద్య నిపుణులు పొలంపల్లి గ్రామంలో సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మి స్వామి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు, అన్ని రకాలైన జబ్బులకు వైద్య పరీక్షలు చేపట్టాన్నారు, సర్పంచ్ మాట్లాడుతూ

మా గ్రామానికి అడగగానే సహకరించిన మల్లారెడ్డి హాస్పిటల్ యజమాన్యానికి మరియు వైద్యం నిపులు డాక్టర్ స్నేహ,మేఘన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, గ్రామంలో ఉన్న నా గ్రామ ప్రజలు ఆరోగ్యంతో ఉండాలని కోరారు మా గ్రామం ఒక చిన్న పల్లెటూరు రోజు కూలి వారి పనులు వ్యవసాయ పనులు చేసుకొని నివసిస్తుంటారు గ్రామం చుట్టూ వివిధ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ద్వారా కాలుష్యం ఇబ్బందులు తలెత్తుతున్నాయి, కాబట్టి నా గ్రామ ప్రజలు బాగుండాలని వాళ్ళ ఆరోగ్య విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని మాపై పెట్టిన ఆ నమ్మకాన్ని నా బాధ్యతను నా గ్రామ ప్రజల సురక్షంగా ఉండడమే నా లక్ష్యంగా భావిస్తున్నాను, గ్రామాన్ని ఆదర్శంగా తీర్చడమే లక్ష్యంగా నా బాధ్యతగా నా గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నా వంతు ప్రయత్నం చేస్తూ నా పాలకవర్గ సపోర్ట్ తో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని వారు పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మి స్వామి, కార్యక్రమంలో మల్లారెడ్డి హాస్పిటల్స్ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది గరిగ సత్తయ్య కిష్టాపురం ఎల్లం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నందిని--సైదేశ్వరరావు వివాహ వేడుకకు ప్రముఖుల హాజరు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** నాగులవంచ గ్రామానికి చెందిన బైరు వెంకటేశ్వర్లు--నాగమణి దంపతుల కుమార్తె నందిని, సైదేశ్వరరావుల వివాహ మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు పలువురు రాజకీయ, సామాజిక, ఆధ్యాత్మిక రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీ గజగిరి లక్ష్మీనరసింహస్వామి, శ్రీ కోదండ రామస్వామి దేవాలయ మాజీ చైర్మన్ నారగాని శ్రీనివాసరావు, దేవాలయ చైర్మన్ ముత్తినేని వెంకటేశ్వరరావు, వార్డు మెంబర్ కాసాని బాలకుమార్, రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అంబటి శాంతయ్య--పద్మ దంపతులు,దేవాలయ కమిటీ సభ్యులు వెచ్చ మంగపతిరావు తదితరులు వివాహ వేడుకకు హాజరయ్యారు.అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల వెంకన్న, బైరు వెంకటేశ్వర్లు, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షులు ఏటుకూరి రవికుమార్, మంద స్వామి తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.గ్రామ పెద్దలు శిలివేరు సైదులు, మంద నాగేశ్వరరావు, తన్నీరు ప్రసాద్, నాగేశ్వరరావు, అనగాని వీరయ్య తదితరులు వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

# మట్టి విగ్రహాలనే పూజిద్దాం.

**ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నివారించాలి: పురోహితుడు వెంకటేశ్వర్లు.**

**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 05,** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ)తో తయారు చేసిన విగ్రహాలను నివారించి, మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని పురోహితుడు పందిళ్లపల్లి వెంకటేశ్వర్లు ప్రజలకు పిలుపునిచ్చారు.



పీఓపీ విగ్రహాలు నీటిలో సులభంగా కరగకపోవడంతో నదులు, చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేయడం వల్ల పర్యావరణానికి హాని కలిగే అవకాశం ఉందన్నారు. నీటి వనరులు కలుషితమై ప్రజారోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని తెలిపారు.

మట్టి విగ్రహాలు సహజంగా నీటిలో కలిసిపోవడంతో పర్యావరణానికి మేలు చేస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి గణపతి విగ్రహాలనే పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.

పర్యావరణ శాఖ అధికారులు స్పందించి పీఓపీ విగ్రహాల తయారీ, వినియోగాన్ని నియంత్రించాలని వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.

